
Toli Velugu 25.01.26_Layout 1 1/25/2026 9:07 AM Page 1

జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..




నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 17 | పేజీలు : 4 | ఆదివారం | 25 జనవరి 2026 | వెల : 2/-

# టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దు

## - సీఎం రేవంత్ రెడ్డి

- టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని సీఎం ఆదేశం
- ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి
- అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు
- టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దని స్పష్టం చేసిన సీఎం





డెస్క్, జనవరి 24 (తొలివెలుగు) : టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనలుంటే వెంటనే విరమించు కోవాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ టీ హబ్ ప్రాధాన్యతను తగ్గించవద్దని ఆయన స్పష్టం చేశారు.



## మున్సిపల్ ఎన్నికలు..

### ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కేటీఆర్

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితా విడుదల
- మున్సిపాలిటీ, కార్పొరేషన్ బాధ్యతలు సీనియర్ నాయకుడికి అప్పగింత
- అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జ్‌లది కీలక పాత్ర అన్న కేటీఆర్

డెస్క్,జనవరి 24 (తొలివెలుగు) : తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఈ మేరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ బాధ్యతలను ఒక సీనియర్ నాయకుడికి అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు వీరు నిరంతరం స్థానిక నాయకత్వానికి, కేడర్‌కు అందుబాటులో ఉంటారని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం ఇన్‌ఛార్జ్‌ల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జ్‌లది కీలక పాత్ర అని ఆయన తెలిపారు. స్థానిక నాయకత్వంతో చర్చించి, అందరినీ సమన్వయపరిచి గెలుపు గుర్రాలకు సంబంధించిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి వారు సమర్పిస్తారని అన్నారు. పార్టీ ప్రచార కార్యక్రమాలను ఇన్‌ఛార్జ్‌లు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిశీలన, కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నేను వ్యక్తిగత దూషణలు చేయను.. చిల్లర భాషను వాడను

## - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో పవీణ్ కుమార్ కు సిట్ నోటీసులు
- విమర్శలు చేసిన 12 గంటల్లోపే చర్యలంటూ ఆరోపణ
- ఆధారాలతో సమాధానమిస్తానని వెల్లడి
- ఇది రేవంత్ రెడ్డి సర్కారు ప్రతీకార చర్యేనని విమర్శ
- సజ్జనార్‌ను సిట్ చీఫ్‌గా నియమించడాన్ని నైతికంగా ప్రశ్నించానని స్పష్టీకరణ



డెస్క్, జనవరి 24 (తొలివెలుగు): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తును విమర్శిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన 12 గంటల్లోపే తనకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతీకార చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వ హెచ్చరికలకు, నోటీసులకు భయపడేది లేదని, తన వద్ద ఉన్న ఆధారాలతోనే సిట్‌కు సమాధానం ఇస్తానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సంబంధం లేకున్నా సిట్ వేధిస్తోందని శుక్రవారం మీడియా సమావేశం లో విమర్శించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ ప్రెస్ మీట్ ముగిసిన 12 గంటల్లోపే, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సిట్ పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని, లేకపోతే ...

మిగతా 2 లో..

# బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు



- వెంటనే తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- నిరాధార, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేటీఆర్
- బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం

డెస్క్,జనవరి 24 (తొలివెలుగు) : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అరవింద్ వెంటనే తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆల్ లీగల్ నోటీసులు పంపించారు. బీజేపీ నేతలకు వేర్వేరుగా ...

మిగతా 2 లో..

# సింగరేణి పై విషప్రచారాలు.. ఎవరి కోసం?

## - భట్టి విక్రమార్క



- ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి
- రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన

☞ 2

# సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి : బండి సంజయ్

- గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి
- ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ
- రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య

డెస్క్, జనవరి 24 (తొలివెలుగు) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు ...

2




# కేటీఆర్‌ను నేరస్తుడిగా పరిగణించలేదు

## - మంత్రి జూపల్లి

- ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలే ప్రసక్తే లేదన్న జూపల్లి
- చట్టబద్ధంగానే విచారణ జరుగుతోందని వ్యాఖ్య
- చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణచేయడం కొత్తేమీ కాదన్న జూపల్లి

2



# ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం



- గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు వ్యాపించిన మంటలు
- రోబో ఫైర్ మిషన్ ద్వారా మంటలు ఆర్పుతున్న సిబ్బంది
- ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

2

Toli Velugu 25.01.26_Layout 1 1/25/2026 9:07 AM Page 2



# సింగరేణిపై విషపురాతలు.. ఎవరి కోసం?

## - భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి..
డెస్క్,జనవరి 24 (తొలివెలుగు) : సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు.

టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.

### 2018లోనే సైట్ విజిట్ నిబంధన..

కోల్ ఇండియా టెండర్ డాక్యుమెంట్ ను కేంద్ర ప్రభుత్వం 2018లో తయారు చేసిందని, అప్పుడే సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిందని భట్టి విక్రమార్క చెప్పారు. 2021లో కేంద్ర గనుల శాఖ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని చెప్పిందన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని ఆయన గుర్తుచేశారు. గత డాక్యుమెంట్లలోని నిబంధనల ఆధారంగానే ఇటీవల సింగరేణి టెండర్లు పిలిచిందని చెప్పారు.




అయితే, మేమే ఈ నిబంధన పెట్టినట్లు పత్రికలు, నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో కూడా ఇష్టానుసారం ప్రచారం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నేను వ్యక్తిగత దూషణలు చేయను.. చిల్లర భాషను వాడను

## - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మొదటిపేజీ తరువాయి.. సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని, ఇలాంటి వార్నింగులకు భయపడనని తేల్చిచెప్పారు. సిట్ చీఫ్ సజ్జనార్‌పై తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, ఆయనపై ఏపీలో నమోదైన కేసులపై సిట్ వేయాలని డిమాండ్ చేసినట్లు నోటీసులో పేర్కొనడం వాస్తవ విరుద్ధమని అన్నారు. "నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను. 2015లో ఓటుకు నోటు కేసు సమయంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కెమెరాకు అడ్డంగా దొరికారు. ఆ తర్వాత ఏపీ నేతల ఫోన్లు ట్యాప్ చేశారని తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో సజ్జనార్ కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో అధికారిగా పనిచేశారు. అందుకే, ఇప్పుడు ఆయనే ఈ



ట్యాపింగ్ కేసు దర్యాప్తుకు నేతృత్వం వహించడం నైతికంగా సరైంది కాదని మాత్రమే నా అభిప్రాయం చెప్పాను. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు" అని తన వ్యాఖ్యలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమర్థించుకున్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బొగ్గు కుంభకోణం వంటివాటిపై సిట్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాత్రమే ఆగమేఘాల మీద నోటీసులు రావడం, దర్యాప్తు వివరాలు మీడియాకు లీక్ కావడం, కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో లైవ్ కామెంటరీలు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా రాజకీయ కుట్ర అని స్పష్టమవుతోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

# బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి.. లీగల్ నోటీసులు జారీ చేశారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఇరువురు నేతలు కూడా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. తనకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాధార ఆరోపణలు చేశారని, ఉద్దేశపూర్వకంగానే వారు తనను లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని కేటీఆర్ తెలిపారు. రాజకీయాల కోసం వారు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్, అరవింద్‌లకు తన న్యాయవాదులతో నోటీసులను పంపించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేటీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు ఆర్జించిందని, సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేశారని బండి సంజయ్ నిన్న ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలను కేటీఆర్ కొట్టిపారేశారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తోందని, అయినప్పటికీ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేమిటని ప్రశ్నించారు. ధర్మపురి అరవింద్ తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని ఆయనకు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. డ్రగ్స్ సేవిస్తున్నారని, సరఫరా చేస్తున్నారని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

## - బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి.. లాగుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ. 42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే, అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా? అని నిలదీశారు.

# బాధిత కుటుంబాలకు 'రాజీవ్ స్మారక్' చేయూత

## - రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు): రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ (ట్రస్ట్) ఆధ్వర్యంలో ఇద్దరు బాధిత కుటుంబాలకు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వికలాంగురాలు ఊదరి రమణ కుటుంబానికి రూ. 15,000 అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న జైకేసారం గ్రామానికి చెందిన కాసుల బాల నరహరికి వైద్య చికిత్స నిమిత్తం మరో రూ. 15,000 అందజేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు జింద్రు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖయ్యూం, ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లా నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం



మొదటిపేజీ తరువాయి..
డెస్క్,జనవరి 24 (తొలివెలుగు) : నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ దుకాణంలో మంటలు చెలరేగి నాలుగో అంతస్తు వరకు వ్యాపించాయి. ప్రమాదం మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో సంభవించి, ఆపై నాలుగు అంతస్తులకు విస్తరించింది. రోబో ఫైర్ మిషన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనా స్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. భవనం లోపల ఇద్దరు చిన్నారులు, నలుగురు పెద్దలు చిక్కుకున్నట్లు సిబ్బంది గుర్తించారు. స్కైలాడర్ ద్వారా నాలుగో అంతస్తు అద్దాలను పగులగొట్టి వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవనం పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు ఖాళీ చేయించారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్‌లో ఫర్నిచర్ నిల్వ ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్నారు. అగ్ని ప్రమాద ప్రాంతంలో పోలీసులు, హైడ్రా సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలంలో అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను అక్కడి నుంచి తరలించారు.

# కేటీఆర్‌ను నేరస్తుడిగా పరిగణించలేదు

## - మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి..
డెస్క్,జనవరి 24 (తొలివెలుగు) : ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షగా చిత్రీకరించడం పూర్తిగా తప్పని, ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి... ఈ కేసులో ప్రజాస్వామ్య పద్ధతిలో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో పాత్రధారులు ఎవరు? దీని వెనుక సూత్రధారులు ఎవరు? అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నడిచే విజిలెన్స్, భద్రతా వ్యవస్థలను దుర్వినియోగం చేయడం దిగజారుడుతనమేనని వ్యాఖ్యానించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన చర్యలను చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తే చేయకూడదా? అని ఆయన ప్రశ్నించారు. కేసులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకోవడంలేదని, పూర్తిగా చట్టబద్ధంగానే విచారణ సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని అప్పట్లోనే వి.ప్రకాశ్ అనే వ్యక్తి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తన ఫోన్ ట్యాప్ అయినట్టు గతంలో వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కూడా ఇదే విషయం చెప్పారని అన్నారు. మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరికొందరు కూడా తమ ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని అంగీకరించారని జూపల్లి తెలిపారు. కేటీఆర్‌కు కేవలం 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని, ఆయనను నేరస్తుడిగా పరిగణించలేదని మంత్రి స్పష్టం చేశారు. సాక్షిగా సమాచారం కోసం మాత్రమే విచారణకు పిలిచామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంను కూడా గతంలో అక్రమంగా అరెస్ట్ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ... చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్త విషయం కాదన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుపై కూడా మంత్రి ప్రశ్నలు సంధించారు. కీలక సమయంలో ఆయన అమెరికాకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు తిరిగి భారత్‌కు వచ్చారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకు అనేక కారణాలున్నాయని, వాటిపై కూడా సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

Toli Velugu 25.01.26_Layout 1 1/25/2026 9:07 AM Page 3



# ప్రజా సమస్యలపై పోరాటమే ప్రజాకలం నైతికత్వం

## - ప్రజాకలం క్యాలెండర్ ఆవిష్కరణ



వలిగొండ, జనవరి 24 (తొలివెలుగు): ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే ప్రజాకలం దినపత్రిక నైతికత్వమని రెడ్లరేపాక గ్రామ సర్పంచి దేశబోయిన బాలస్వామి యాదవ్ అన్నారు. శనివారం రెడ్లరేపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాకలం దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాకలం దినపత్రిక ప్రజల అభిమానాన్ని చూరగొన్నదని తెలిపారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు చేరవేస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాస్తవ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడం అభినందనీయమన్నారు. ప్రజాకలం దినపత్రిక ఇలాంటి నూతన సంవత్సరాలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నవనీత్, ప్రజాకలం రిపోర్టర్ కదిరేణి సురేష్, తొలివార్త రిపోర్టర్ నర్సింహ, వార్డు సభ్యులు మధు, శ్రీనివాస్, కరోబార్ లింగస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి - క్షేమంగా ఇంటికి చేరండి

- ❖ క్రమశిక్షణకు చాక్లెట్.. నిర్లక్ష్యానికి గులాబీ!
- ❖ రహదారి భద్రతపై త్రినిటీ విద్యార్థుల అవగాహన.
- ❖ ప్రాణ రక్షణే లక్ష్యం: పట్టణ సీఐ, ఎంపీఐల పిలుపు.
- ❖ కూడళ్లలో సందడి చేసిన విద్యాసంస్థల ప్రతినిధులు.



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : అంతర్జాతీయ విద్యా దినోత్సవం, రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని త్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పట్టణంలో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌరస్తా, గాంధీ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి నిబంధనలు పాటిస్తున్న వారికి చాక్లెట్లు ఇచ్చి అభినందించగా, హెల్మెట్ లేని వారికి గులాబీ పూలు అందజేసి వినమ్రంగా నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మన్మథ కుమార్, ఎంపీఐలు ప్రణీత్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని సూచించారు. కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జుని మంజుల, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# రిపబ్లిక్ డే వేడుకల్లో అంబేద్కర్ ఫోటో ఏర్పాటు చేయాలి

## - సామాజిక కార్యకర్త సంగీశెట్టి క్రిస్టఫర్



వలిగొండ, జనవరి 24 (తొలివెలుగు) : రిపబ్లిక్ డే వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, మలిదశ ఉద్యమకారుడు సంగీశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ అన్నారు. శనివారం వలిగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జరిగితేనే ప్రజలకు సమాన అవకాశాలు లభిస్తాయని భావించిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన పేర్కొన్నారు. సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాన్ని నిర్మించాలనే లక్ష్యంతో రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు నిరంతరంగా శ్రమించి భారత రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి రాజ్యాంగ రూపకల్పన పూర్తి చేసి, 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని దేశానికి సమర్పించారని గుర్తు చేశారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకోకుండా రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించడం బాధాకరమని విమర్శించారు. కనీసం ఆయన ఫోటోను కూడా వేడుకల్లో ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక జీవో జారీ చేసి, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో తప్పనిసరిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి - సీఐటీయూ

- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికుల పోరాటం
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్



వలిగొండ, జనవరి 24 (తొలి వెలుగు): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. శనివారం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న 28 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులు సాధించుకున్న అనేక హక్కులను పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును పరిమితం చేయడంతో పాటు యాజమాన్యాన్ని ప్రశ్నించే చట్టాలను కూడా తొలగించారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం వంటి మౌలిక హక్కులను విస్మరించి, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఈ కోడ్‌లు రూపొందించారని అన్నారు. గతంలో ఏడుగురు సభ్యులు ఉంటేనే కార్మిక సంఘానికి రిజిస్ట్రేషన్ లభించేదని, ప్రస్తుతం ఆ విధానాన్ని రద్దు చేసి వందమంది సభ్యులు ఉంటేనే సంఘాన్ని నమోదు చేసే విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. దీని వల్ల పేద కార్మికుల హక్కులు దెబ్బతిని పెద్ద పెట్టుబడిదారులకు లాభం చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. అలాగే, కార్మికుల ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న పని గంటల విధానాన్ని రద్దు చేసి, రోజుకు ఎనిమిది గంటల పనికి బదులుగా పది గంటలు పనిచేయాల్సిన విధానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండే నరసింహ, కుర్తి రాములు, ఉక్కుర్తి యాదయ్య, చేకూరి నాగేష్, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

## - మండల ఇన్‌చార్జి విద్యాధికారి సుంకోజు భాస్కర్





వలిగొండ, జనవరి 24 (తొలివెలుగు): పాఠశాల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి సుంకోజు భాస్కర్ అన్నారు. పాఠశాల అభివృద్ధిలో సమాజ సేవకుల భాగస్వామ్యం అనే కార్యక్రమంలో భాగంగా వలిగొండ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వలిగొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలకుంట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యుడు కౌడే కృష్ణ పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్‌ను అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మంచి చేయాలనే సదుద్దేశంతో ఈ సహకారం అందించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ఇప్పటికే చక్కగా అభివృద్ధి చెందుతోందని, మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులోనూ మద్దతు కొనసాగించాలని కోరారు. దాత కౌడే కృష్ణకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతనిచ్చే మంచి మనసుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా తోడుగా ఉంటామని, పాలకవర్గం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం సర్పంచ్, వార్డ్ సభ్యులు కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించగా, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఏబీసీ చైర్మన్ గోవిందమ్మ, ఉపసర్పంచ్ మల్గ మాధవి, వార్డ్ సభ్యులు దంతూరి అరుణ్, బత్తిని నాగేష్, గొలుసుల శాంతి, మైసోళ్ళ మాధవి, పబ్బు అరుంధతి, పల్లెర్ల లక్ష్మయ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు మునగపాటి వరమ్మ, మామిడి కవిత, మణిమాల, ప్రశాంతి, ఉషా, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పోరుకు సీపీఎం సన్నద్ధం

- లౌకిక శక్తులతో కలిసి 20 వార్డుల్లో పోటీ
- సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్




చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీలో రానున్న ఎన్నికలకు సీపీఎం పార్టీ సమరశంఖం పూరించింది. పట్టణంలోని 20 వార్డుల్లో లౌకిక శక్తులతో కలిసి పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ వెల్లడించారు. శనివారం అమరజీవి కామ్రేడ్ కందాల రంగారెడ్డి భవనంలో దండ అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా, పెరిగిన జనాభాకు అనుగుణంగా చౌటుప్పల్‌లో వసతులు మెరుగుపడలేదని ఆయన విమర్శించారు. నాగులకుంట, పెద్ద చెరువు సుందరీకరణ, ఇండోర్ స్టేడియం పూర్తి చేయడం, డిగ్రీ కళాశాల ఏర్పాటు వంటి పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధనకు సిపిఎం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే కమ్యూనిస్టు అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, మాజీ సీపీఎం పార్టీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్, నాయకులు బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉస్కా గుల శ్రీనివాస్, పర్ని ధర్మారెడ్డి, బొడ్డు అంజిరెడ్డి, బాతరాజు దశరథ, తూర్పునూరి మల్లేశం, గుణమోని ఐలయ్య, చికూర్ ఈదయ, చింతకింది పాండు, సప్పిడి శ్రీనివాసరెడ్డి, సిలివేరు జంగయ్య, దాసరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

- దశదిన కర్మలో పాల్గొన్న వెన్‌రెడ్డి రాజు



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 16వ వార్డుకు చెందిన బడుగు సుజాత (బడుగు అంజయ్య కోడలు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం నిర్వహించిన ఆమె దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎండీ బాబా షరీఫ్, ఆవుల యేసు, చిలువేరు శ్రీశైలం, రాఘవేంద్ర, వీరుమల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

- అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి : అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : జిల్లాలోని మైనార్టీ నివాస పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక సంస్థలు, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్యను, వసతులను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా స్కూల్, ఇంటర్మీడియట్ స్థాయిల్లో ఉన్న కోటాను భర్తీ చేసుకునేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ, డీఎండబ్ల్యూఓ జయమ్మ, ఆర్‌సీఓ శ్రీకాంత్, ఉర్దూ మైనార్టీ ఆఫీసర్ ఫౌజియా, మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థల ప్రిన్సిపల్ బాలకృష్ణ, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యలగూడెంను నూతన మండల కేంద్రంగా ప్రకటించాలి

- అల్లాపురం మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : చేనేత వస్త్రాలతో దేశవ్యాప్తంగా పేరుగాంచిన కొయ్యలగూడెం గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని అల్లాపురం మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ డిమాండ్‌ను వినిపించారు. చేనేత కార్మికులకు ప్రధాన నిలయంగా ఉన్న కొయ్యలగూడెం గ్రామానికి ఇప్పటివరకు సరైన ప్రాధాన్యత దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ గ్రామానికి ప్రభుత్వం తగిన స్థాయిలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కొయ్యలగూడెం, దేవలమ్మ నాగారం, పీపల్ పహాడ్, అల్లాపురం, ఎనగంటి తండ, తుంబాయి తండ, రాచకొండ, ఎల్లంబావి, ఎల్లగిరి, కైతాపురం, ధర్మోజిగూడెం, మల్కాపురం, తుప్రాన్‌పేట మొత్తం 13 గ్రామపంచాయతీలను కలిపి నూతన మండలాన్ని ఏర్పాటు చేసి, కొయ్యలగూడెంను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై త్వరలోనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలను కలిసి మెమోరాండం అందజేస్తామని ఆయన తెలిపారు.

# అభివృద్ధికి కాంగ్రెస్ అడ్డంకి : ఎంపీ కె. లక్ష్మణ్





- మోదీ పాలనలో పారదర్శకత: రూ.45 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి!
- కులవృత్తులకు 'విశ్వకర్మ' భరోసా - ఎంపీ లక్ష్మణ్ వివరణ.
- రామ మందిర దర్శనానికి రాహుల్ గాంధీకి భయమెందుకు?
- గ్రామాల్లో పారిశుధ్య విప్లవం.. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి.

చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : కాంగ్రెస్ పార్టీ నాయకులకు అభివృద్ధి కంటే దోచుకోవడం, దాచుకోవడంపైనే మక్కువ ఎక్కువని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో శనివారం నిర్వహించిన 'వికసిత్ భారత్ - ఆజీవిక మిషన్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాల లోపభూయిష్ట విధానాల వల్ల కులవృత్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'విశ్వకర్మ' పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా 18 రకాల సంప్రదాయ వృత్తుల్లో పనిచేసే వారికి ఆర్థిక సహాయం, ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. మోదీ పాలనలో పారదర్శకత పెరిగిందని పేర్కొంటూ, ఉజ్వల గ్యాస్, స్వచ్ఛ భారత్, జనధన్ వంటి పథకాల ద్వారా నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతున్నాయని చెప్పారు. గత 11 సంవత్సరాల్లో రూ.45 లక్షల కోట్లకు పైగా నిధులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ప్రజలకు చేరాయని వెల్లడించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించి గ్రామాల్లో పారిశుధ్య విప్లవం సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ, అందరి ఆరాధ్య మందిరమైన అయోధ్య రామ మందిరాన్ని దర్శించుకోవడానికి కూడా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, దోనూరు వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, దూడల బిక్షం, చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షుడు కైరం కొండ అశోక్, కొయ్యలగూడెం గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న, గుండ్లబావి సర్పంచ్ నందగిరి వెంకటేష్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, యాస అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరాడంబరంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వివాహం

- రిజిస్టర్ ఆఫీసులో ఒక్కటైన యువ అధికారులు



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : ఉన్నత హోదాల్లో ఉండి సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన ఇద్దరు యువ సివిల్ సర్వీస్ అధికారులు అత్యంత సాదాసీదాగా వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఈ వేడుక జరిగింది. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెంకు చెందిన యువ ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డిలు ఎలాంటి ఆడంబరాలు లేకుండా రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)గా విధులు నిర్వహిస్తున్న శేషాద్రిని రెడ్డికి, ఐఏఎస్ శిక్షణలో ఉన్న శ్రీకాంత్ రెడ్డికి మధ్య ఏర్పడిన పరిచయం వివాహ బంధానికి దారితీసింది. ఇద్దరూ పరస్పర అంగీకారంతో కేవలం సంతకాలతో తమ వివాహాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ఉన్నతాధికారులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ధనవ్యయం, అట్టహాసాలకు దూరంగా జరిగిన ఈ వివాహం జిల్లాలో చర్చనీయాంశమైంది.

# అంగన్వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

- భోజన సౌకర్యాలను పరిశీలించిన సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



చౌటుప్పల్, జనవరి 24 (తొలివెలుగు) : ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా కోరారు. శనివారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆయన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తోందని, దీనిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రానికి హాజరవుతున్న గర్భిణీలు, చిన్నారుల వివరాలను రిజిస్టర్లలో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచకొండ భార్గవ్, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త పారిజాత తదితరులు పాల్గొన్నారు.